క్లుప్తంగా

ఉప ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి



బ్రాహ్మణపల్లెలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ విజయశేఖర్

ఓర్వకల్లు: ఈ నెల 19న వివిధ గ్రామాలలో జరిగే వార్డు సభ్యుల ఉప ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం ఎన్నికలు జరిగే ఓర్వకల్లు, శకునాల, బ్రాహ్మణపల్లె గ్రామాలలోని పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఆయా గ్రామాలలో అభ్యర్థుల మధ్య గట్టి పోటీ జరుగుతున్న నేపథ్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించాలని ఎస్‌ఐ రాజారెడ్డికి సూచించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు జరిగే గ్రామాలలో గురువారం నుంచి శనివారం సాయంత్రం వరకు మద్యం దుకాణాలను మూయించి, నాటుసారా అమ్మకుండా చూడాలని ఆదేశించారు. స్త్రీ, పురుషులకు ప్రత్యేక బూత్‌లను ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ శివనాగప్రసాద్‌కు సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈఓఆర్‌డీ సుబ్బరాయుడు, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ ఉన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి

సి.బెళగల్: పల్లెల శుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు శ్రద్ధ వహించాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలో పర్యటించి పరిసరాల పరిశుభ్రత, మంచినీటి నిర్వహణను పరిశీలించి, ఆయా గ్రామాల సచివాలయాలను తనిఖీ చేశారు. మంచినీటి నిర్వహణ, సరఫరా తదితర అంశాలను పకడ్బందీగా చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. గ్రామంలో ప్రధాన దారివెంట ఉన్న చెత్తను తొలగించి చెత్త సేకరణ కేంద్రానికి తరలించాలని పారిశుద్ధ్య కార్మికులను ఆదేశించారు. గ్రామాల పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు



బ్రోచర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, మేయర్

పాణ్యం: పాణ్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంబంధించిన ఇంగ్లీషు, తెలుగు బ్రోచర్లను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి గురువారం కర్నూలులోని ఆయన నివాసంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ బాటనీ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభం కావడంతో బ్రోచర్లను విడుదల చేశామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కర్నూలు మేయర్ బీవై రామయ్య, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి, లెక్చరర్లు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

పాణ్యం: కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న అధ్యాపకులను రెగ్యులర్ చేసి వారి జీవితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని పాణ్యంలోని అధ్యాపకులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2014 జూన్ 2 కంటే ముందు నుంచి పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకం అన్నారు. ఈ నిర్ణయంతో ఎంతో మంది అధ్యాపకుల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. 'థ్యాంక్యూ సీఎం సార్' అంటూ నినాదాలు చేశారు. మహిళా ఉద్యోగులు నూర్జహాన్, దాక్షయిని పాల్గొన్నారు.

ఉత్తమ హెచ్‌ఎంకు సన్మానం

పాణ్యం: విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య అధ్యక్షుడు రాజునాయక్ అన్నారు. గురువారం పాణ్యంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కృష్ణానాయక్‌ను జీపీఎస్ నేతలు ఘనంగా సన్మానించారు. ఈనెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆయనకు ఉత్తమ అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురువుల మార్గ నిర్దేశకత్వంలో యువకులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ కృష్ణానాయక్ వివిధ జిల్లాల్లో పని చేసి వందల సేవా పురస్కారాలు, అనేక అవార్డు పొందారన్నారు. విక్రమ్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ జీవరత్నమ్మ, హేమలత, మహేశ్వరి, నాగరాణి, గౌసియా, బాలకృష్ణ, రామిరెడ్డి, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

సిరుల పంట మొక్కజొన్న

- ఖరీఫ్‌లో ఆసక్తి చూపుతున్న రైతులు
- మండలంలో ఐదు వేల ఎకరాల్లో సాగు
- ఎకరాకు రూ.30 వేలకు పైగా ఆదాయం
- 110 రోజుల్లో పంట చేతికి..



గడివేములలో సాగు చేసిన మొక్కజొన్న పంట

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం రైతుకు అడుగడుగునా అండగా ఉంటోంది. పెట్టుబడి సాయం అందిస్తూ కొండంత భరోసానిస్తోంది. వాతావరణం కూడా రైతుకు సహకరిస్తోంది. దాంతో రైతు ఆలోచనలలో మార్పు వచ్చింది. కొత్తగా ఆలోచిస్తూ ఏడాది పొడవునా సాగు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. లేత దశలో తెగుళ్ల నివారణ విభిన్న పంటల సాగుతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా వరితో పాటు వివిధ రకాల పంటలను సాగు చేస్తుండగా కొన్ని గ్రామాల్లో ఏడాది పొడవునా మొక్కజొన్నను సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఇది వాణిజ్య పంటగా రైతులను ఆకర్షిస్తోంది. పశువులకు కూడా దాణాగా, మేతగా పనికొస్తోంది. చాలా పరిశ్రమల్లో ముడి సరుకుగాను, తినుబండారాలు పేలాలు, తీపి కండె, కాయగూరల రకంగాను వినియోగిస్తున్నారు. వాడకం బాగా పెరగడంతో సాగు కూడా పెరుగుతోంది. దీంతో మొక్కజొన్న సాగుకు వ్యవసాయ అధికారులు సలహాలు సూచనలు అందిస్తున్నారు.

మండలంలో ఐదు వేల ఎకరాల్లో సాగు

మండలంలో మొత్తం 34,382 ఎకరాల సాగుభూమి ఉండగా ఖరీఫ్‌లో 25 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేశారు. మొక్కజొన్న పంటను 4 నుంచి 5 వేల ఎకరాలలో సాగు చేశారు. తక్కువ పెట్టుబడితో తొందరగా చేతికి వచ్చే పంటగా రైతులు మొక్కజొన్నను ఎన్నుకున్నారు. ఎకరానికి రూ.15 నుంచి 20 వేల వరకు పెట్టుబడి వస్తుందని ఖర్చులు పోనూ రూ.25 వేల నుంచి రూ.30 వేల ఆదాయం వస్తుందని తెలిపారు. మొక్కజొన్న ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో రైతులు అధికంగా సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

విత్తు నాటే ముందు

విత్తే ముందు భూమిని మూడు, నాలుగు సార్లు దుక్కి దున్నాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు సుమారు 10 టన్నులు పశువుల ఎరువు వేయాలి. తరువాత నాగలితో బోదె, కాలువలు చేసుకోవాలి. బోదెకు పైనుంచి మూడో వంతు ఎత్తులో విత్తాలి. దీని వల్ల నీటి పారుదల సులభంగా ఉంటుంది. వర్షపాతం ఎక్కువైనపుడు నీరు బయటకు పోయేందుకు వీలు కలుగుతుంది. మొలకెత్తిన పది రోజుల తరువాత ఒత్తుగా మొలిచిన చోట బలంగా ఉన్న ఒక్కొక్క మొక్కను మాత్రమే ఉంచి అదనంగా ఉన్న మొక్కలను పీకివేయాలి.

లేత దశలో తెగుళ్ల నివారణ

కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెట్ లేదా థైరం లేదా కాప్టాన్తో విత్తనశుద్ధి చేసుకుంటే లేత దశలో మొక్కలను తెగుళ్ల బారి నుండి కాపాడుకోవచ్చు.

ఎరువుల యాజమాన్యం

వర్షాధారపు పంటకు విత్తే సమయంలో మూడో వంతు నత్రజని, మరోసారి 30-35 రోజుల సమయంలో మూడో వంతు నత్రజని, 50-55 రోజుల మధ్య మరోసారి మూడో వంతు నత్రజనిని వేయాలి. విత్తే సమయంలో మొత్తం భాస్వరం ఎరువును, సగం పొటాష్ ఎరువును వేయాలి. మిగతా సగం పొటాష్‌ను పూత దశలో వేసుకోవాలి. నీటి పారుదల పంటకు విత్తే సమయంలో నాలుగో వంతు నత్రజని, 25-30 రోజుల సమయంలో మరోసారి నాలుగో వంతు నత్రజని, 45-50 రోజుల మధ్య నాలుగో వంతు నత్రజని, చివరగా 60-65 రోజుల మధ్యకాలంలో నాలుగో వంతు వేయాలి. ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను మూడు పంటలకోసారి దుక్కిలో వేయాలి. మొక్కలలో జింక్ లోపం ఉంటే లీటరు నీటిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి పంటపై పిచికారీ చేయాలి. భూమిలో తగినంత తేమ ఉన్నపుడు మాత్రమే పైపాటు ఎరువులు వేయాలి.

కలుపు నివారణ

పంట విత్తిన తరువాత రెండు మూడు రోజుల్లోపు అట్రజిన్ అనే కలుపు మందును పిచికారీ చేయాలి. దీనిని తేలిక నేలలో ఎకరాకు 800 గ్రాములు, బరువు నేలలో ఎకరాకు 1200 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి విత్తి నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. ఇలా చేయడం వల్ల వెడల్పాటి గడ్డి జాతి కలుపు మొక్కలను దాదాపు ఒక నెల పాటు అదుపు చేయవచ్చు. మొక్కజొన్నను పప్పుజాతి పంటల్లో అంతర పంటగా వేసేటపుడు ఎకరా పంటకు 200 లీటర్ల నీటిలో లీటరు పెండిమిథాలిన్ కలిపి నాటిన రెండు రోజుల్లో పిచికారీ చేయాలి. విత్తిన నెల రోజులకు వెడల్పాటి కలుపు మొక్కలను గమనిస్తే ఎకరా పంటకు 200 లీటర్ల నీటిలో 500 గ్రాముల 2, 4డి సోడియం సాల్ట్‌ను కలిపి పిచికారీ చేయాలి.

ప్రతిసారి మొక్కజొన్న సాగు చేస్తా



ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగుకు అనుకూలంగా ఉంటుంది. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయాధికారులు మంచి సలహాలు ఇస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తుండటంతో నాకున్న నాలుగు ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశాను. దీనికి తోడు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో పాటు క్రాప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతో ఉత్సాహంగా పంటలు సాగు చేస్తున్నాం.

–శివుడు, రైతు, గడిగరేవుల

త్వరగా దిగుబడి వస్తుంది



పంట సాగుచేసిన రోజు నుంచి మూడు నెలల్లోనే తక్కువ పెట్టుబడితో త్వరగా పంట చేతికి వస్తుండటంతో రైతులు అధికంగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. విత్తనం వేసిన 30-35 రోజులకు ఎద్దులతో లేదా ట్రాక్టర్‌తో కలుపు మొక్కలను నివారించవచ్చు. వేసిన పంటలో కలుపు మొక్కల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లోని వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

–హేమసుందర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఏడీఏ, నంద్యాల

నేడు బైన్‌దొడ్డిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోడుమూరు రూరల్: మండలంలోని బైన్‌దొడ్డి గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరించడంతో పాటు, సమస్యలను తెలుసుకుంటారన్నారు. మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

గూడూరు రూరల్: గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వేగంగా పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ జమ్మన్న సూచించారు. కె.నాగలాపురంలో జరుగుతున్న గృహ నిర్మాణాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో 87 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరయ్యాయని, ఇప్పటికే పలువురు లబ్దిదారులు గృహ నిర్మాణం పూర్తి చేసుకుని ప్రవేశాలు జరుపుకున్నారన్నారు. లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, సిమెంటు, స్టీల్‌తో పాటు బిల్లులను మంజూరు చేస్తున్నామన్నారు. గృహాలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉపాధి పనులు కల్పించండి

గూడూరు రూరల్: వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులను కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని ఏపీఓ రామేశ్వరమ్మ పేర్కొన్నారు. కె.నాగలాపురంలో ఉపాధి పనులను ఆమె గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఉపాధి పనులు కూడా చేపట్టడం జరిగిందన్నారు. కూలీలు కొలతల ప్రకారం పనులు చేయాలని రోజుకు గరిష్ట వేతనం రూ.272 పడేలా చూసుకోవాలన్నారు. పనులు అడిన ప్రతిఒక్కరికీ కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

మా నమ్మకం నువ్వే జగనన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్
- కోడుమూరు నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్లతో సమావేశం
- వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు రూ.10 లక్షల ఉచిత బీమా నమోదు

కర్నూలు (న్యూటౌన్): అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని, మా నమ్మకం నువ్వే జగనన్న అని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం కర్నూలు నగర శివారులోని ఇంపీరియల్ గార్డెన్స్‌లో కోడుమూరు నియోజకవర్గంలోని జేసీఎస్ (జగనన్న సచివాలయ కన్వీనర్లు)లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని జేసీఎస్ కన్వీనర్లకు పార్టీ తరఫున రూ.10 లక్షల ఉచిత బీమా చేయించారని స్పష్టం చేశారు. పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తున్న గ్రామ/వార్డు సచివాలయ కన్వీనర్ల కుటుంబాల గురించి ఆలోచించి బీమా చేయించడం గొప్ప విషయమన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. శిబిరంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రి, ఎంపీపీలు వెంకటేశ్వరమ్మ, బొంతల మునెప్ప, వైస్ ఎంపీపీ-2 నెహేమ్యా, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, మౌలాలి, గిరిజోన్, నాయకులు అమగుంట్ల కృష్ణారెడ్డి, ప్రభాకర్, రాజశేఖర్ రెడ్డి, సంపత్ కుమార్, వెంకటేశ్వర్ రెడ్డి, మండల జేసీఎస్‌లు, మున్సిపల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు అస్లాం, లక్ష్మన్న, సర్పంచ్‌లు బాలకృష్ణ, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే జనరంజక పాలన

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- మండల, గ్రామ జేసీఎస్ కన్వీనర్లకు బీమాతో భరోసా
- రావూరి గార్డెన్స్‌లో జేసీఎస్ కన్వీనర్లతో సమావేశం
- 98 శాతం హామీలు అమలు చేశాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ప్రజలందరూ మెచ్చేలా శ్రేష్టమైన పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కర్నూలు నగరంలోని రావూరి గార్డెన్స్ ఫంక్షన్ హాలలో నియోజకవర్గంలోని జేసీఎస్ మండల, గ్రామ/వార్డు సచివాలయాల ఇన్‌చార్జ్ కన్వీనర్లకు ఉచిత బీమా నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి నియోజవర్గ పరిధిలోని నాలుగు మండలాలు, కల్లూరు అర్బన్ జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, సచివాలయాల కన్వీనర్లు, పలువురు ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మండల జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, సచివాలయాల కన్వీనర్లకు పార్టీ తరఫున బీమా సౌకర్యం కల్పించారన్నారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ముఖ్యమంత్రిగా పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. అందుకు గ్రామ స్థాయి నుంచి నాయకులు సమన్వయంగా పని చేయాలన్నారు. ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం చేసిన మంచిని సచివాలయాల కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు.

98 శాతం అమలు:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసిందని, సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి అర్హులైన వారందరికీ నేరుగా ఇంటి వద్దకే పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో తేడాను రాష్ట్రంలోని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో అర్హులై ఉండి పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీ సిఫారసులతో పాటు నాయకుల అండదండలు కావాల్సివచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రమాణికంగా పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు.

50 శాతం పదవులు మహిళలకే:

రాష్ట్రంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కార్పొరేటర్లు, మేయర్లు, జెడ్పీటీసీ చైర్మన్లు, నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం పదవులు కేటాయించామన్నారు. రాష్ట్రంలో అందిస్తున్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ మొదలగు సంక్షేమ పథకాలలో 75 శాతం మహిళల పేరుపై అమలు చేస్తున్నామని వివరించారు. డిప్యూటీ మేయర్ రేణుక, కర్నూలు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కల్లూరు అర్బన్, నాలుగు మండలాల జేసీఎస్ ఇన్‌చార్జ్ కన్వీనర్లు హనుమంతురెడ్డి, గోవర్దన్‌రెడ్డి, కేశవరెడ్డి, లోటర్‌బాష, సుమంత్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీలు, వివిధ సంఘాల డైరెక్టర్లు, కార్పొరేటర్లు, నియోజకవర్గంలోని నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వార్డు ఎన్నికల ప్రచారం



కౌలురులో అభ్యర్థి ముల్లా షంషాద్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న సద్దల సూర్యనారాయణ రెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని కౌలురు గ్రామం ఐదో వార్డు స్థానానికి జరుగుతున్న ఎన్నికకు సంబంధించి అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. గురువారం సాయంత్రం అభ్యర్థి ముల్లా షంషాద్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలంటూ మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. మండల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వార్డులోని ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం, ఎమ్మెల్యే చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధిని వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి నేతృత్వంలో గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయన్నారు. ఏళ్ల తరబడి ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. వార్డు అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి ముల్లా షంషాద్‌ను అధికి మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బాలస్వామి రెడ్డి, సుధాకర్ రెడ్డి, ప్రసాద రెడ్డి, మండల కన్వీనర్ సుమంత్‌రెడ్డి, సారంగపాణి, మహనందిరెడ్డి, ఉమేష్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, వెంకటయ్య కో-ఆప్షన్ సభ్యులు జాకీర్, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, అహ్మద్‌ఉసేన్ పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

సి.బెళగల్: మండల పరిధిలోని ఇనగండ్ల గ్రామానికి చెందిన బాధితురాలికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మంజూరైన నగదును గ్రామ ప్రజా ప్రతినిధులు, అధికారులు అందజేశారు. గ్రామానికి చెందిన గొల్ల శివన్న ఇటీవల అనారోగ్యంతో మరణించారు. అతని పేరిట వైఎస్సార్ బీమా నమోదై ఉండడంతో నామినీగా ఉన్న తల్లి గొల్ల యంకమ్మకు గురువారం ప్రభుత్వం మంజూరు చేసిన తక్షణ సాయం రూ.10 వేలను గ్రామ సర్పంచ్ ఇమ్మాని యేల్, ఎంపీటీసీ సభ్యురాలు తిమ్మలమ్మ, సచివాలయ సంక్షేమ సహాయకుడు చందు బాధితురాలి ఇంటికి వెళ్లి అందజేశారు. సాయం అందించడంపై బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య

కల్లూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో ప్రతి ఇంట్లో సంక్షేమ వెలుగులు నిండాయని వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 19వ వార్డు నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ, సోమిశెట్టి నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. కాలనీ వాసులు డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు, కల్వర్టులు నిర్మించాలని విన్నవించగా ఆయా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహితంగా జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. పథకాల అమల్లో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా అర్హులైన వారి బ్యాంకు ఖాతాలోనే నగదు జమ చేస్తున్నారన్నారు. పథకాల ద్వారా ప్రజలు జీవనోపాధులను మెరుపర్చుకోవాలని సూచించారు. వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, కార్పొరేటర్లు లక్ష్మిరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, స్థానిక నాయకులు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పంట నమోదు పక్కాగా చేపట్టండి

ఓర్వకల్లు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను పక్కాగా నమోదు చేయాలని వ్యవసాయాధికారి సుధాకర్ ఆదేశించారు. ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలలో సిబ్బంది పంట నమోదు చేస్తున్నట్లు చెప్పారు. వర్షాధారం కింద సాగు చేసిన పంటలను భూ సర్వే నంబర్లతో సహా వివరాలు పొందుపర్చాలని సూచించారు. రైతులు ఆర్బీకేల్లోని వీఏఏలు, వీహెచ్ఏలను సంప్రదించి పంట నమోదు చేయించుకోవచ్చన్నారు. ఆర్బీకేలు లేని గ్రామాలలో ఎంపీఈఓల ద్వారా క్రాప్ బుకింగ్ చేస్తున్నట్లు చెప్పా రు. గత మూడు రోజుల నుంచి ఇప్పటివరకు 548 ఎకరాలలో పంట నమోదు చేపట్టినట్లు వెల్లడించారు. పంట నమోదు చేసుకున్న వివరాల ప్రకారమే ప్రభు త్వం రాయితీ పథకాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పంట నమోదు చేసుకోని వారికి ఎలాంటి వ్యవసాయ రాయితీలు, పథకాలు వర్తించవని తేల్చి చెప్పారు. ఏఈఓ భాస్కర్, వీఏఏ వెంట ఉన్నారు.

కల్లూరు: మండలంలోని రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస రెడ్డి సూచించారు. గురువారం ఎ.గోకులపాడు, పెద్దపాడు, సల్కాపురం గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదు వల్ల వాతావరణ బీమా, ఫసల్ బీమా యోజన, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర సేవలు పొందవచ్చన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

గడివేముల: బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఎంఈఓ విమలా వసుంధరాదేవి సూచించారు. గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో జీఈఆర్ సర్వేపై విద్యా సంక్షేమ సహాయకులతో వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గడివేముల మండలంలోని బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉండే విధంగా చూడాలని విద్యా సంక్షేమ సహాయకులను సూచించారు. సర్వేలో ఎవరైనా పిల్లలను బడి బయట గుర్తిస్తే వారిని పాఠశాలలో చేర్పించాలని సూచించారు. మండలంలో 228 మంది వలంటీర్లకు గాను 220 మంది సర్వే పూర్తి చేశారని, మిగతా త్వరగా పూర్తి చేయాలన్నారు. చదువు మధ్యలో మానేసిన వారు తిరిగి చదువు కొనసాగించేలా చూడాలని, ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ చదువులకు అవకాశం ఉందన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోడుమూరులో పచ్చదనం సంతరించుకున్న పొద్దు తిరుగుడు పంట



వర్కూరు వద్ద కళకళలాడుతున్న ఉల్లి పైరు



పులకుర్తిలో ఏపుగా పెరిగిన సజ్జ పంట

కళకళలాడుతున్న పైర్లు



పులకుర్తిలో ఆముదం పంట

కోడుమూరు రూరల్: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు కాస్త ఆలస్యమైనప్పటికీ గత నెల రోజుల నుంచి సమయానికి తగినట్లుగా వర్షాలు పడుతుండడంతో మండలంలో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలో 9 వేలకు పైగా ఎకరాల్లో రైతులు పత్తి, కంది, వేరుశనగ, సజ్జ, కొర్ర, ఉల్లి వంటి పంటలను సాగు చేశారు. ఈ పంటలన్నీ ప్రస్తుతం పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. గత నాలుగైదు రోజుల నుంచి వర్షాలు కొంత తెరిపి ఇవ్వడంతో పంటలు సాగు చేసిన రైతులంతా పొలాల్లో కలుపు మొక్కల తొలగింపు, ఎరువులు వేయడం, మందులు పిచికారీ చేయడం వంటి పనుల్లో నిమగ్నమవ్వడంతో కూలీలకు భారీగా డిమాండ్ ఏర్పడింది.

ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలి

రైతులు సాగు చేసిన పంటలను ప్రతి రోజు పరిశీలిస్తూ ఉండాలి. ఏవైనా తెగుళ్లు సోకినట్‌లైతే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి నివారణ మందులను పిచికారీ చేసుకోవాలి. రైతులకు అవసరమైన ఎరువులు, మందులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. అవసరమైన రైతులు ఆర్‌బీకేలను సంప్రదించి ఎరువులు, మందులు పొందవచ్చు. ఖరీఫ్ కింద సాగు చేసిన పంటలన్నింటినీ రైతులు తప్పక పంట నమోదు చేయించుకోవాలి. పంట నమోదు ఉంటేనే ప్రభుత్వం ద్వారా రైతులకందే సబ్సిడీలు అందుతాయి.

– రవిప్రకాష్, ఏఓ, కోడుమూరు